

యాస్మిన్, సాయితేజ్ వివాహ చిత్రం

- యాస్మిన్ మృతిలో కుటుంబ సభ్యులదే పాత్ర
- పరారీలో తండ్రి, ఇద్దరు సోదరులు
- బంధువు నుంచి కూపీ లాగుతున్న పోలీసులు
- మతాంతర వివాహం చేసుకోవడమే కారణం

పథకం ప్రకారమే హత్య!

చిత్తూరు అర్బన్,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని బాలాజీనగర్ కాలనీలో సోమవారం జరిగిన అనుమానాస్పద మృతిని పోలీసులు పరువు హత్యగా దాదాపు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. మతాంతర వివాహం చేసుకుందన్న కక్షతో యాస్మిన్‌ను ఆమె తండ్రి, ఇద్దరు సోదరులు కలిసి అంతమొందించి పరారయ్యారు. అయితే యాస్మిన్‌ను హత్య చేయాలని ముందే కుటుంబ సభ్యులు ప్లాన్ చేసుకున్నట్లు పోలీసుల అదుపులో ఉన్న వారి దగ్గరి బంధువు చెప్పినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. చిత్తూరు బాలాజీనగర్ కాలనీలో నివాసముంటున్న ఆర్ఎంపీ షౌకత్‌అలీ,ముంతాజ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.చిన్న కూతురు యాస్మిన్(26) ఎంబీఏ పూర్తి చేసింది. కాలేజీలో ప్రేమించిన పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన సాయితేజ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది.సాయితేజ్ దళితుడని ఇంట్లో తెలిసి తల్లిదండ్రులు యాస్మిన్‌కు వేరొకరితో పెళ్లి నిశ్చయించారు. పెళ్లికి మూడు రోజులు ముందు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యాస్మిన్ ఫిబ్రవరి 9వ తేదీన నెల్లూరులో సాయితేజ్‌ను పెళ్లి చేసుకుంది.తమ కూతురు కన్పించడం లేదని అప్పట్లో యాస్మిన్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.వారితో ప్రాణహాని ఉందని గుర్తించిన యాస్మిన్, సాయితేజ్ తిరుపతి పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబాల వారిని పోలీసులు పిలిపించి సర్ది చెప్పి పంపించారు. అప్పటి నుంచి రెండు నెలల వరకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వీరి సంసారం సాగింది.

తండ్రికి ఆరోగ్యం బాలేదని పిలిపించి..

యాస్మిన్ పెళ్లితో కుటుంబ పరువు పోయిందని భావించిన షౌకత్‌అలీ కుటుంబ సభ్యులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. పూర్తిగా విచక్షణ కోల్పోయి ఆమె ప్రాణం తీసేందుకు ప్లాన్ చేశారు.యాస్మిన్ పెళ్లి తర్వాత తండ్రి షౌకత్‌అలీ డిప్రెషన్‌కు గురయ్యారని, రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని ఫోన్లో పలుమార్లు మాట్లాడారు. ఒకసారి వచ్చి చూస్తే ఆయన బాగవుతారని నమ్మించారు. దాంతో ఆమె భర్త సాయితేజ్‌ను అడగ్గా.. అత్తారింటి గురించి తెలిసిన వ్యక్తిగా వద్దని వారించాడు. పదేపదే పిలుస్తుండడంతో యాస్మిన్ కూడా ఒక్కసారి వెళ్లొస్తానని అడగడంతో విధి లేని పరిస్థితిలో ఆదివారం ఉదయం 11.45 గంటల ప్రాంతంలో చిత్తూరు గాంధీ విగ్రహ కూడలి వద్దకు యాస్మిన్‌ను తీసుకొచ్చాడు.అక్కడినుంచి యాస్మిన్‌ను ఆమె పెద్దమ్మ కుమారుడు లాలూ సాహెబ్ ఇంటికి తీసుకెళ్లాడు. వచ్చిన 20 నిమిషాల్లోపే ముందుగా అనుకున్న పథకం ప్రకారం యాస్మిన్‌ను గొంతు నులిమి చంపేశారు.తన భార్యకోసం సాయితేజ్ కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు.దీంతో ఆందోళన చెందిన సాయితేజ్ నేరుగా అత్తగారింటికి వెళ్లి తన భార్య గురించి అడిగాడు.యాస్మిన్ ఉరేసుకుని చనిపోయిందని, ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని యాస్మిన్ అక్క నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సాయితేజ్ హడావిడిగా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలోకి వెళ్లాడు.చివరకు మార్చురీలో మృతదేహం ఉందని తెలిసింది.పోస్టుమార్టం సందర్భంగా యాస్మిన్ మెడ కింద గాయాన్ని వైద్యులు నిర్ధారించారు.పోస్టుమార్టం పూర్తయ్యాక సోమవారం సాయంత్రం శవాన్ని అప్పగించడంతో సాయితేజ్ సొంతూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

పోలీసుల అదుపులో దగ్గరి బంధువు

యాస్మిన్ మృతి కేసులో తండ్రి, ఇద్దరు సోదరులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ కుటుంబ దగ్గరి బంధువును అదుపులోకి తీసుకున్నారు. యాస్మిన్ మృతి విషయంలో ఏం జరిగిందని, నిందితులు ఎక్కుడున్నారని విచారిస్తున్నారు. యాస్మిన్‌ను చంపాలని ముందే ప్లాన్ చేసుకుని పిలిపించినట్లు పోలీసుల అదుపులోని వ్యక్తి అంగీకరించినట్లు తెలుస్తోంది. చంపింది నిజమే కానీ, ఎలా చంపారనేది పోలీసులు ఇంకా నిర్ధారణకు రావడం లేదు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు దొరికితేనే విషయం తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక క్లారిటీ

యాస్మిన్ మృతి విషయం సెన్సిటివ్ కావడంతో పోస్టుమార్టం రిపోర్టు విషయంలో వైద్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సోమవారమే పోస్టుమార్టం పూర్తయినా మంగళవారం రాత్రికి కూడా రిపోర్టు సిద్ధం కాలేదని సమాచారం. పోస్టుమార్టం చేసిన వైద్యులు సీనియర్ల ఒపీనియన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. బుధవారం రిపోర్టు వచ్చాక ఏ విధంగా హత్య చేశారనేది విషయంపై స్పష్టత రానుంది.

ఆర్డీఎస్ఎస్ పనులు
పూర్తయ్యేదెప్పుడు?

- ఏడాది పడుతుందంటున్న అధికారులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకోసం చేపట్టిన పనులు ఆలస్యమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్) నిధులతో జరుగుతున్న పనులు పూర్తయితే విద్యుత్ సరఫరాలో అంతరాలు తొలగనున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం సింగిల్ ఫేజ్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో.. తరచూ ఎక్కడో ఒక చోట అంతరాయం కలుగుతోంది. ఆ క్రమంలో ప్రజలతోపాటు చిన్న, కుటీర పరిశ్రమల నిర్వహణ భారంగా మారింది. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు.ఈ పరిస్థితులను అధిగమించేందుకు సింగిల్ ఫేజ్ వ్యవస్థను త్రీఫేజ్‌గా మారుస్తున్నారు. ఇందు కోసం జిల్లాకు సుమారు రూ.200 కోట్లు మంజూరయ్యాయి.ఇప్పటివరకూ జిల్లావ్యాప్తంగా 30 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మొత్తం విద్యుత్ సర్వీసులు : 7,52,663

- గృహ సర్వీసులు : 5,03,970
- వాణిజ్య సర్వీసులు : 57,363
- వ్యవసాయ సర్వీసులు : 1,59,462
- పరిశ్రమలు : 12,074
- హెచ్‌టీ సర్వీసులు : 279



చిత్తూరు మండలంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను పరిశీలిస్తున్న కన్‌స్ట్రక్షన్ డీఈ అమరబాబు

● పరిశ్రమలకు మేలు

కూటమి ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోంది.ఇటీవల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.కోట్ల రాయితీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తోంది. దాంతో నగర, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి పరిశ్రమల ఏర్పాటు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, పిండి మిషన్లు, కుటీర పరిశ్రమలు పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా త్రీఫేజ్ కనెక్షన్లు ఏర్పాటు చేస్తే 24 గంటల విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఏర్పడుతుంది. గృహ, వ్యవసాయ కనెక్షన్లు వేరుచేస్తూ...వాటికి ప్రత్యేక ఫీడర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా ఇంటర్ లింక్ వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు.

●గ్రామాలకు వేరుగా లైన్లు

ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా వ్యవసాయ పంపుసెట్లు ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తారు.పొలాలకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తారు. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు వెళ్లే ప్రత్యేక లైన్లకు త్రీఫేజ్ ఇస్తారు. పొలాలకు వెళ్లే లైన్‌కు తొమ్మిది గంటల పాటు మాత్రమే త్రీ ఫేజ్ ఇచ్చి... తరువాత నిలిపివేస్తారు. జిల్లాలో ఉన్న ఫీడర్లతో పాటు అదనంగా 50 ఫీడర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాతాల్లో ఉంటే రైస్‌మిల్లులు, త్రీఫేజ్‌పై ఆధారపడే పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ అందనుంది.

● నత్తనడకన పనులు

జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు రెండేళ్ల క్రితమే ప్రారంభమైనా పనులు జరిగింది మాత్రం 35 శాతం కంటే తక్కువేనని చెప్పాలి. ఈ పనులపై గత ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అంతే కాకుండా కార్మికుల కొరత కూడా మరో కారణమని అధికారులు చెబుతున్నారు.దేశమంతా ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతుండడంతో కార్మికుల కొరత ఏర్పడింది. ఈ కారణం చేత పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి.

కూలీల కొరతతో ఆలస్యం



ఈ ఏడాదికే జిల్లాల్లో ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తి కావాల్సివుంది. అయితే పనులు చేసేందుకు లేబర్ లేక ఆలస్యమైంది. వచ్చే ఏడాదికి పనులు పూర్తవుతాయి. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో కూడా 24 గంటల పాటు త్రీఫేజ్ కరెంటు సరఫరా ఉంటుంది.

\- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

1నుంచి 'వేసవి' ఆటలు

- విద్యార్థులకోసం నెలపాటు ఉచితంగా క్రీడాశిబిరాలు
- శిక్షణ ఇవ్వడానికి పీడీ, పీఈటీలు, అసోసియేషన్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనుంది. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. సెలవుల్లో విద్యార్థులను ఆటలు ఆడించడానికి క్రీడాప్రాధికార సంస్థ ప్రణాళిక రూపొందించింది. మే 1 నుంచి 31వ తేదీవరకు జిల్లా కేంద్రం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత క్రీడా శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 50 క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో క్యాంపులో 25 మంది బాలురు, 25 మంది బాలికలకు అవకాశం కల్పించనున్నారు. రోజూ ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు క్రీడా శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాల్లో శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి కలిగిన పీడీలు, పీఈటీలు, క్రీడా అసోసియేషన్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎస్‌డీవో బాలాజి తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు మెసానికల్ మైదానంలోని డీఎస్‌డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

నేడు 'ప్రజాదర్బార్'

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేల కార్యాలయాల్లో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, వారి సమస్యపై చర్చిస్తారు. ● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు బంగారుపాళ్యం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి చిత్తూరులో లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో పూతలపట్టు, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాల ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు.

నేడు, రేపు చిత్తూరులో 'డైట్' ట్యాబ్ బేస్డ్ టెస్ట్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో బుధ, గురువారాల్లో 'డైట్' ట్యాబ్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా చిత్తూరులోని డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు తెలుగు, ఇంగ్లీష్, పీఈటీ, ఫైన్స్ ఆర్ట్స్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు ఫిజికల్ సైన్స్, సైన్స్, సోషియల్, సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగుతాయి. 17వ తేదీన ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సైకాలజీ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు ఫిలాసఫీ సబ్జెక్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. కార్వేటినగరం డైట్‌లో 22 ఖాళీల భర్తీలో భాగంగా నోటిఫికేషన్ ఇవ్వగా, 230మంది దరఖాస్తు చేసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేశాక 107 మంది పరీక్షలు రాసేందుకు అర్హత సాధించారు.

జిల్లాకు ప్రైవేటు హోమియోపతి కళాశాల మంజూరు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రైవేటు హోమియోపతి కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలోని శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా వెంకటేశ్వర మెడికల్ అండ్ హాస్పిటల్ పేరుతో ఈ కళాశాల ఏర్పాటు కానున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నాలుగు హోమియోపతి కళాశాలలు ఉండగా.. ఇది ఐదవదని తెలిపారు.

పీవీకేఎన్ కళాశాలలో 19న జాబ్ మేళా

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో ఈనెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛ్సేంజి, సీడప్ (ఎస్ఈఈడీఏపీ), డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సుమారు 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, 1000 ఉద్యోగాల కల్పనకు ఈ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన 18-35 ఏళ్ల లోపు యువతీయువకులు అర్హులన్నారు. వివరాలకు 99854 42270, 85200 48041 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):అసెంబ్లీ పద్దుల కమిటీ బృందం బుధవారం చిత్తూరు రానుంది. కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతో పాటు సభ్యులు భూమా అఖిల ప్రియ, బంగారు సత్యానందరావు, జయకృష్ణ, నారాయణ రెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, వాల్మీకి పార్థసారథి, సునీల్‌కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీలు పర్చూరి అశోక్ బాబు, డాక్టర్ వరహా వెంకటసూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి వస్తున్నారు. వీరు తిరుపతి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించి, సాయంత్రం 5.30గంటలకు తిరుమలకు వెళతారు.

శ్రీసిటీలో 'వందే భారత్' స్లీపర్ బోగీల ఇంటీరియర్ పనులు

శ్రీసిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'వందే భారత్' స్లీపర్ ఎక్స్‌ప్రెస్ కోసం వివిధ వ్యవస్థలను రూపొందించడం, రైలు పెట్టెల్లో అమర్చడం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తిరుపతి జిల్లా శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా చేపట్టింది. ఈ ప్రాజెక్టులో 16 కోచ్‌ల రైలు కోసం ఇంటీరియర్స్, మాడ్యులర్ టాయిలెట్ క్యాబిన్లు, ఏరోడైనమిక్ ఫ్రంట్ ఎండ్‌ల రూపకల్పన, తయారీ, ఇన్‌స్టాల్ చేయడం వంటి పనులను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ రైలులో 823 బెర్త్‌లు, 51 టాయిలెట్లు ఉంటాయి. కాగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో తేలికైన, మన్నికైన ఉత్పత్తులతో రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించే విప్లవాత్మక వందే భారత్ స్లీపర్ ప్రాజెక్టులో భాగం కావడం తమకు గర్వకారణమని బీఎఫ్‌జీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కె.ప్రేమమూర్తి తెలిపారు.



జస్టిస్ మురళి పురుషోత్తమన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళి పురుషోత్తమన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నారు.



పరిటాల సునీత

సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరి లోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.58 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,078

తలనీలాలు సమర్పించినవారు: 25,831



తిరుపతి కళాకారులకు 'కందుకూరి' అవార్డులు

- శాంభోళ హరినాథ్, కృష్ణమూర్తి, వివేక్ ఎంపిక
- నేడు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కందుకూరి అవార్డులకు తిరుపతికి చెందిన ముగ్గురు రంగస్థల కళాకారులు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి వేడుకలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారాలకు శాంభోళ హరనాథ్, కృష్ణమూర్తి, పత్తిపాటి వివేక్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం ఏపీఎఫ్‌డీసీ ప్రకటించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగే తెలుగు నాటకరంగ దిన వేడుకల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పురస్కారాలు అందజేయనున్నారు. ఒక్కొక్కరికి రూ10వేలు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నారు.

భళా శాంభోళ



శాంభోళ హరినాథ్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు. కానీ, ఆయన కళాకారుడిగానే అందరికీ పరిచయం. 1976లోనే వేషం వేసుకుని ప్రథమ బహుమతి పొందారు. హాస్యాన్ని అలవోకగా, ఆశువుగా చెప్పగల చమత్కారి. అతను వేదిక ఎక్కితే నవ్వువచ్చేస్తుంది. అలాగని హాస్యానికే పరిమితం కాలేదు. కొన్ని సాంఘిక నాటికల్లో కన్నీరు తెప్పించిన అనేక పాత్రలను పోషించి విభిన్న నటుడిగా గుర్తింపు పొందారు. బెస్ట్ కమెడియన్‌గా అవార్డులు అందుకున్నారు. ఆయనకు వచ్చిన జ్ఞాపికల కోసం ఓ గదిని అద్దెకు తీసుకొని, అందులో అందంగా పేర్చి వాటిని చూసుకుంటూ ముచ్చటపడుతుంటారంటే రంగస్థలంపై ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది.

కళా కృష్ణమూర్తి



ఎంకాం, ఎంబీఏ పూర్తిచేసి స్విమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్నారు. అక్కడ పనిచేసే 8 గంటలూ రోగుల సేవలోనే ఉంటారు. బయటకు వస్తే నటన గురించే ఆలోచిస్తారు. తొలినాటకం 'భక్త కన్నప్ప'లో నటించారు. 'పాండవోద్యోగ విజయం'లోని ఉపప్లావ్య ఘట్టంలో తొలిసారిగా కృష్ణుడి పాత్ర వేశారు. చెంచితలో చెంచునాయుడు పాత్రలో కృష్ణమూర్తి ఒదిగిపోయారు. 'తరిగొండ వెంగమాంబ' నాటకంలో శివగురు పాత్రతో విలనిజం చూపించారు. బుల్లితెరపై మొగలిరేకులు, హరిలోరంగహరి, కుమ్మరి భీమన్న, భీష్మ, అపార్ట్‌మెంట్ వంటి సీరియల్స్ చేశారు. పేరుకు తగ్గట్టే శ్రీకృష్ణుడు, కుసాలన్న పాత్ర, కాళహస్తి మహత్యంలో కాశీపాత్ర (హాస్యం) గుర్తింపు తెచ్చాయి. తరిగొండ వెంగమాంబ, పాండవోద్యోగం నాటకాలు పేరు తెచ్చాయి.

మైమ్ స్టార్ వివేక్



శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సాంస్కృతిక కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్. విద్యార్థిగా ఉన్నప్పుడే మైమ్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్నారు. 2022లో 'నాటిక' రచనకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. విశ్వవిద్యాలయాల మధ్య జరిగే అనేక సాంస్కృతిక పోటీల్లో వివేక్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. మైమ్ ద్వారా అద్భుతమైన సందేశాలిచ్చేవారు. ఇటీవల వర్సిటీలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అందులోని విజేతలను, దక్షిణ భారత విశ్వవిద్యాలయాల్లో ఎస్వీయూను అగ్రస్థానంలో నిలిపారు. ఎస్వీయూ చరిత్రలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు.

ధాన్యం పైనా సూర్యప్రతాపం

- అధిక ఉష్ణోగ్రతల్లో ఆరబెడితే నష్టమే
- అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే అవకాశం
- కొంత పచ్చిగా ఉన్నప్పుడే పంటకోత మేలంటున్న వ్యవసాయ అధికారులు




తేమ శాతం తగ్గించేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మకాలకు రైతులు సిద్ధపడుతున్నారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పచ్చిగా ఉన్నప్పుడే అమ్ముకుంటే గిట్టుబాబు ధర రాదని భావిస్తున్న రైతులు.. ధాన్యాన్ని ఎండలో బాగా ఆరబెట్టి తేమను తొలిగించే పనిలో పడ్డారు. కోత దశకు వచ్చిన పంటను కోత కోసి వచ్చిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో ఈ ఏడాది మార్చి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. సూళ్లూరుపేట ప్రాంతంలో దాదాపు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో ధాన్యం అధికంగా ఎండిపోయే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే బియ్యం ముక్కలయ్యే అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వరి కంకుల్లో 90 శాతం గింజలు పసుపు రంగుకు మారుతున్నప్పుడు, కర్ర పచ్చిగా ఉండగానే పంట కోయాలి.
- పంట పక్వానికి వచ్చాక కోత ఆలస్యం చేయకూడదు.
- పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండి మిల్లింగ్ సమయంలో అధికంగా నూక వస్తుంది.
- ఎండ తక్కువ తగిలే చోట ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి.
- 17 శాతం తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం ఎక్కువగా ఎండినా బియ్యంలో నూక శాతం ఎక్కువ అవుతుంది.



ఆరిన ధాన్యం రాశులు



ఆరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పోస్తున్న ధాన్యం

తూలి కిందపడ్డ సూళ్లూరుపేట ఎమ్మెల్యే

- విజయశ్రీకి స్వల్ప గాయాలు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంట్లో ఘటన

తడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తూలి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో మంగళవారం జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయశ్రీ వెళ్లారు. కారుదిగి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో ప్రధాన గడప వద్ద తూలి కింద పడిపోయారు. ముఖం నేలకు కొట్టుకుని సల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వెంటనే వచ్చి విజయశ్రీని పైకి లేపారు. గాయమైన చోట రక్తం కారుతుండడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించారు. కొద్దిసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్న విజయశ్రీ సాయంత్రం నాయుడుపేటలోని స్వగృహానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను పరామర్శించారు.

విజబుల్ పోలీసింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

పనితీరు మార్చుకోని వారిపై కఠిన చర్యలు ● అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ హెచ్చరిక



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరగాలంటే విజబుల్ పోలీసింగ్‌ను బాధ్యతగా నిర్వహించాలి. ఈ విషయంలో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారు పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు' అని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో మంగళవారం ఆయన జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ బూజింగ్, పరిసరాల పరిశుభ్రత, విజబుల్ పోలీసింగ్, పల్లెనిద్ర, ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం, పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో పోలీసు కార్యక్రమాలను ప్రతిరోజు పక్కాగా నిర్వహించాలన్నారు. వీటిపై ఎలాంటి స్పందన వస్తోందనేది డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే వారు సంఘ వ్యతిరేక శక్తులుగా మారతారన్నారు. ప్రజలకు మనోధైర్యం కల్పించేలా పనిచేయాలే కానీ ఇబ్బంది పెట్టేవిధంగా కాదని పోలీసులకు సూచించారు. సబ్ డివిజన్ల పరిధిలో నమోదవుతున్న.. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఎందుకు ఛేదించలేకపోతున్నారని ప్రశ్నించారు. అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమయం దాటాక ఎవరైనా మద్యం తాగుతూ కనిపిస్తే పోలీస్ ట్రీట్‌మెంట్ గట్టిగా ఇవ్వాలన్నారు. నైట్‌బీట్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శక్తి యాప్‌పై నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. త్వరలో సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, డీఎస్పీలు, ఎస్బీ సీఐ షాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక

తిరుపతి(వైద్యం),ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించే టీటీడీ ప్రాణదాన పథకానికి 194 మంది రోగులను ఎంపిక చేశారు.స్విమ్స్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో మంగళవారం ప్రాణదాన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ 1, కార్డియోథొరాసిక్ 18, ఈఎన్‌టీ 8, జనరల్ సర్జరీ 1, మెడిసిన్ 12, నెఫ్రాలజీ 39, న్యూరాలజీ 23, న్యూరోసర్జరీ 29, గైనకాలజీ 23, సైకీయాట్రీ 1, సర్జికల్ ఆంకాలజీ ముగ్గురు రోగులను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించే టీటీడీ ప్రాణదాన పథకానికి దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే మరింత మందికి వైద్యం అందించే అవకాశం ఉంటుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు శివశంకర్, గోపీ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటీ రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11మంది సభ్యుల బృందం బుధవారం ఉదయం 5.15గంటలకు తిరుపతి పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకుంటారన్నారు. 11గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి చిత్తూరు జిల్లాలో సమీక్షలో పాల్గొని రాత్రి 7.30గంటలకు తిరుమల చేరుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని 11.30గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఈవో శ్యామలరావు, ఇతర అధికారులతో సమీక్షా నిర్వహించి సాయంత్రం 5.15గంటలకు విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'స్కిట్'ను పునఃప్రారంభిస్తాం

మరో ఆరు నెలల్లో రానున్న పది పరిశ్రమలు ● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'మరో 20 రోజుల్లో 'స్కిట్' (శ్రీకాళహస్తీశ్వరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో మరమ్మతులు ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభిస్తాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ సహాయంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ఆశయంగా తుది శ్వాస వరకు ప్రజల కోసం గోపాలకృష్ణారెడ్డి పరితపించారన్నారు. 30కి పైగా ఎంఎన్‌సీ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ యువతకు స్థానిక పరిశ్రమల్లో 33శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామన్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, మండలం, ఏర్పేడు, రేణిగుంటలో విస్తారంగా ప్రభుత్వ భూములున్నాయన్నారు. మరో ఆరు నెలల్లో సుమారు పది పరిశ్రమలు ప్రారంభించేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి, ఉద్యోగాల కల్పనతో యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్న తపనతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టిసారిస్తున్నారని చెప్పారు. తరచూ సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో కొత్త పరిశ్రమల కోసం భూముల పరిశీలన సాగిస్తూ ఎప్పటికప్పుడు యువతకు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సూచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు రెండు వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 1,788మంది 33ఎంఎన్‌సీ కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 712మందికి అప్పటికప్పుడు నియామకపత్రాలు అందాయి. 305మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరధాచారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాధంనాయుడు, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రవీంద్రారెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.





జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు - 2014-19లో సీఎం చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యాన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి తీసుకొచ్చిన పరిశ్రమలతో తయారు చేసిన జ్ఞాపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పూలవనంలో జెర్రిపోతు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని పూలవనంలోకి ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు ప్రవేశించింది. గుర్తించిన కార్మికులు వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు.

విద్యార్థికి ప్రభుత్వపరంగా
సహకారమందిస్తా: కలెక్టర్


ఎంపీ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో నికిత్ చౌదరి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో 989 మార్కులు సాధించిన నికిత్ చౌదరికి ప్రభుత్వపరంగా ఏ సహకారమైనా అందిస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గంగాధరనెల్లూరు మండలం కొట్రకోన పంచాయతీ గారంపల్లెకు చెందిన నికిత్‌చౌదరిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తన వెంట తీసుకెళ్లి మంగళవారం కలెక్టరేట్‌లో సుమిత్‌కుమార్‌కు పరిచయం చేసి, వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కలెక్టర్ అభినందించారు.

వాహనం ఢీకొని టీచర్‌కు తీవ్రగాయాలు


గాయపడ్డ చంద్రశేఖర్ రెడ్డి

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొనడంతో ఓ టీచర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సీఆర్ కండ్రిగ చెందిన పేట చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ బాబు టీచర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి వెదురుకుప్పం రోడ్డుపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కుటుంబీకులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఉష్ణోగ్రతల్లో తవణంపల్లె టాప్


ఎండదెబ్బకు బోసిపోయిన చిత్తూరు సీబీ రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు అధికమౌతున్నాయి. మంగళవారం అత్యధికంగా తవణంపల్లె మండలంలో 40.2, అత్యల్పంగా పుంగనూరులో 33.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. మండలాలవారీగా చిత్తూరు, గుడిపాల మండలాల్లో 39.3డిగ్రీలు, శ్రీరంగరాజపురం,నగరి మండలాల్లో 39.1, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 38.6, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 37.3, బంగారుపాళ్యం, గంగాధరనెల్లూరు, సదుం మండలాల్లో 37.1, యాదమరిలో 37, చౌడేపల్లె, ఐరాల , కార్వేటినగరం, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, రొంపిచెర్ల మండలాల్లో 36.9, సోమలలో 36.2, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 35.6, వి.కోటలో 35.1, రామకుప్పంలో 34.7, బైరెడ్డిపల్లెలో 34.5, పలమనేరులో 34.2, కుప్పంలో 34.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


గొడుగు నీడన వెళ్తున్న మహిళలు

13 మండలాల్లో వర్షం

ఉపరితల ఆవర్తన ప్రభావం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా పెనుమూరులో 38మిమీ, అత్యల్పంగా గుడిపాలలో 1 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీగా ఎస్ఆర్‌పురంలో 11.8, శాంతిపురంలో 17.2, వి.కోటలో 12.2. పలమనేరులో 11.4, గంగవరంలో 11.2, గంగాధరనెల్లూరులో 7.2, వెదురుకుప్పంలో 4.8, కార్వేటినగరంలో 4.2. గుడుపల్లెలో 4.2. చిత్తూరులో 2.6. నగరిలో 2.0 మిమీ వర్షం కురిసింది.

పుత్తూరు మున్సిపాలిటీలో విచారణ
రెండు వారాల్లో పూర్తి : ఆర్డీ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై విచారణలో భాగంగా ఆర్డీ విశ్వనాథ్ మంగళవారం కార్యాలయానికి విచ్చేశారు. పలు కీలక ఫైళ్లను పరిశీలించారు. మరో రెండు వారాల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు, చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లలో జరిగిన విచారణ నివేదికలను ప్రభుత్వానికి అందించామన్నారు. 2015 సంవత్సరంలో నగరి మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాలాజీనాథ్ యాదవ్ ఉన్న సమయంలో పెన్షన్ పంపిణీలో అవకతవకలు జరిగాయి. అప్పటి నుంచే విచారణ కొనసాగుతోంది. ప్రస్తుత నగరి కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం ఆర్డీకి సదరు దస్త్రాలు అందజేశారు. అవకతవకలు ఇంకా తేలకపోవడం గమనార్హం. అలాగే ఏపీఎంఎంఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీకి వినతిపత్రం సమర్పించారు. రాయలసీమ జోన్ పరిధిలోని మున్సిపాలిటీల్లో పనిచేసే మేనేజర్లు, ఆర్వోల పట్ల కమిషనర్లు దురుసుగా వ్యవహరిస్తున్నారని విన్నవించారు.

విచారణలో తీవ్ర జాప్యం

అవినీతి ఆరోపణలపై కమిటీ చేపట్టిన పునర్విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు అత్యవసరంగా కమిటీని ఏర్పాటు చేసి పునర్విచారణ చేపట్టారు. కమిటీ విచారణ ప్రారంభించి నెల రోజులకు పైగా కావస్తున్నా పురోగతి లేకుంది. కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు ఇతర అధికారులు ఉన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించే బాధ్యత పబ్లిక్ హెల్త్ విభాగానికి ఉండటంతో జిల్లా స్థాయి అధికారులు బిజీగా ఉన్నారు. ఈ వ క్రమంలో విచారణలో జాప్యం జరుగుతోంది.

ఎస్టీపీ నిర్మాణం సాగేనా..!

- పనుల్లో మరింత ఆలస్యం
- భూసేకరణకు నిధుల కోసం నిరీక్షణ




పలమనేరు పెద్దచెరువు, మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు అధికారులు ఎంపిక చేసిన స్థలం, గతప్రభుత్వ హయాంలో పెద్దచెరువులో మురుగునీటి మళ్లింపునకు చేపట్టిన కాలువ

పలమనేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం మరింత ఆలస్యం అవుతోంది. గత మూడు దశాబ్దాలుగా పలమనేరుకు ఆనుకుని ఉన్న పెద్దచెరువులో కలుస్తున్న మురుగునీటి కారణంగా భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి ఆ నీటిని వ్యవసాయానికి వినియోగించుకునేలా నేతలు ప్రతిసారి ఎన్నికల్లో చెబుతూనే ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఈ మురుగునీటిని చెరువులో కలవకుండా చేసేందుకు కాలువ నిర్మించి పెద్దచెరువు ఆయకట్టులోని రాజ కాలువకు మళ్లించాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే ఆయకట్టుదారులు మురుగునీటి కారణంగా తాము వ్యవసాయం చేసుకునే అవకాశం ఉండదని తీవ్రంగా అభ్యంతరాలు చెప్పడంతో అధికారులు మురుగునీటి విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేక పెద్దచెరువుకే మళ్లించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటి అంచనాలతో పెద్దచెరువులో నీరు కలవకుండా ప్రత్యేక కాలువ నిర్మించేందుకు పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మున్సిపల్ అధికారులు మళ్లీ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఇందుకోసం గత సంవత్సరం అధికారులు పెద్దచెరువు ఆయకట్టు మధ్యలో 3.48 ఎకరాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదించారు. దీంతో ఆయకట్టుదారులు నిర్మాణానికి అభ్యంతరాలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే జాయింట్ కలెక్టర్ విద్యాధరి నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. దీంతో ప్రజలు పెద్దచెరువులో మురుగునీరు కలుస్తున్న ప్రాంతంలోనే ఈ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించాలని మున్సిపల్ పాలక వర్గంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో మున్సిపల్ పాలక వర్గం సైతం అధికారులు ఆయకట్టులో ఎంపిక చేసిన స్థలంలో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని వ్యతిరేకించారు. జిల్లా అధికారులు పలమనేరులో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు 3.48 ఎకరాల స్థలాన్ని ఎకరా రూ2 కోట్లకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇక్కడ ప్రతిపాదించిన కేంద్రం సామర్థ్యం రోజుకు 8 ఎంఎల్‌టీ మురుగునీరు శుద్ధి చేసే కేంద్రం కాగా... ప్రస్తుతం పలమనేరులో మున్సిపల్ అధికారులు ప్రజలకు సరఫరా చేస్తున్న నీరే కేవలం 3.4 ఎంఎల్‌టీలు మాత్రమే. దీంతో అంత పెద్ద కేంద్రం ఇక్కడ నిర్మించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. అంతేకాక గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాలిటీలోను మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాల్సి వస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం పడనుంది. దీంతో ఏపీ మున్సిపాలిటీకి కావాల్సిన సామర్థ్యంతో నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీంతో పలమనేరులో దాదాపు 1.5 ఎకరాల స్థలం ఉంటే చాలన్న నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే కేంద్రం కోసం ప్రభుత్వం రూ. 1.10 కోట్లు మంజూరు చేసిందని తెలిసింది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వం నుంచి భూసేకరణకు సంబంధించి నిధులు వస్తేగాని మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం ప్రారంభం కాదని తెలుస్తోంది. ప్రతిపాదిత ఆయకట్టు స్థలం ఆయకట్టు మధ్యలో ఉంది. అక్కడికి వాహనాలు, చివరకు పాదచారులు వెళ్లేందుకు కూడా దారిలేదని .. ఇటువంటి చోట కేంద్రం ఏర్పాటు చేస్తే కావాల్సిన యంత్ర సామగ్రి అక్కడికి ఎలా తీసుకెళ్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.


ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి (ఫైల్‌ఫొటో)

ముందుగానే పసికట్టి

ప్రస్తుతం అధికారులు ఎస్టీపీ ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణను ముందుగానే పసిగట్టి ఓ వ్యక్తి తనకున్న 1.80 ఎకరాలతో పాటు పక్కనే ఉన్న చిన్నచిన్న రైతుల నుంచి చిన్న చిన్న కమతాలను కారు చౌకగా భూములు కొనుగోలు చేశాడని.. అతడి లబ్ధి కోసమే అధికారులు ప్రయత్నిస్తున్నారని కొందరు అప్పట్లో ఆరోపించారు.

చెరువులోనే కేంద్రం ఏర్పాటుతో ప్రయోజనాలు

పలమనేరు పెద్దచెరువులోనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. పెద్దచెరువు దాదాపు 80 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో ఆక్రమణలు దాదాపు 15 ఎకరాల వరకు ఉంటుంది. ఈ ఆక్రమణలు తొలగించినా మురుగునీటి శుద్ధి కేంద్రానికి కావాల్సింది కేవలం 3.5 ఎకరాలు మాత్రమే. అంతేకాక చెరువులోనే మురుగునీరు కలుస్తున్నందున అక్కడే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే భూమి కోసం ఎవరికీ నష్టపరిహారం కింద రూ.7 కోట్లు చెల్లించే అవసరం ఉండదు. మురుగునీటి కేంద్రానికి బెంగళూరు, మదనపల్లి రహదారులు ఆనుకునే ఉన్నందున వాహనాలు వెళ్లి రావడానికి సౌకర్యంగా ఉంటుంది. కేంద్రంలో శుభ్రం చేసిన తరువాత ఆయకట్టులోని పొలాలకు నీటిని వ్యవసాయానికి వాడుకునే అవకాశం ఉంటుంది. ఈ కేంద్రం ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి అసౌకర్యంగా ఉండే భూమి కొనుగోలుకు పెట్టే రూ. 7 కోట్లతో ఆయకట్టులో సాగునీటి కోసం కాలువలు నిర్మించడంతో 120 ఎకరాల ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. జిల్లా అధికారులు ఇకనైనా స్పందించి పలమనేరులో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుపై స్థానికుల అభిప్రాయాన్ని, ఆయకట్టు రైతుల అభిప్రాయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నలుగురు విద్యార్థులకు 'సన్‌షైన్ స్టార్' అవార్డు


మంత్రి నారా లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న సుస్మిత, శ్రీనివాసులు, స్రవంతి, హర్షిత

ప్రదానం చేసిన మంత్రి నారా లోకేశ్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వం యాజమాన్య జూనియర్ కళాశాలల్లోని జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి సన్ షైన్ స్టార్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి అవార్డులను మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రదానం చేశారు. అవార్డు అందుకున్నవారిలో.. కుప్పం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన వి.సుస్మిత (976/1000), టి.శ్రీనివాసులు (952/1000), రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థిని బీఆర్ స్రవంతి (935/1000), కుప్పం నిడుమూరు మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.అశ్విని (969/1000), పలమనేరు టీకేసీ జూనియర్ కళాశాల విద్యార్థిని టి.హర్షిత (971/1000) ఉన్నారు. వీరిని డీవీఈవో సయ్యద్ మౌల, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు అభినందించారు.

వెట్టిచాకిరీకి బలవుతున్న కూలీలకు
విముక్తి కల్పించండి: కలెక్టర్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీకి బలవుతున్న కూలీలను గుర్తించి, విముక్తి కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్బంధ వెట్టిచాకిరి కూలీ విధానం నిర్మూలనపై సంబంధిత అధికారులు, రోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వెట్టిచాకిరీ విధానం కోళ్ల పరిశ్రమ, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, తదితర చోట్ల చాలా వరకు ఉందన్నారు. అలాంటి చోట కూలీలను గుర్తించడానికి డివిజన్ స్థాయిలో తహసీల్దార్లకు అవగాహన కార్యక్రమాలను ఆర్డీవోలు నిర్వహించాలని సూచించారు. కార్మికశాఖ, డీఆర్‌డీఏ, డ్వామా, జడ్పీ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సందర్భంలోనూ ఆకస్మిక తనిఖీలు చేపట్టి కూలీలను గుర్తించాలన్నారు. అనంతరం వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా ఒక నేరం తదితర అంశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డీపీవో సుధాకర్‌రావు, డీఎంహెచ్‌వో సుధారాణి, ఎన్‌వైకే కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, డీటీడబ్ల్యూవో మూర్తి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, రోప్స్ సంస్థ చైర్మన్ ధనశేఖర్, ప్రోగ్రామ్ హెడ్ శాంజె బాదురే తదితరులు పాల్గొన్నారు.

నేడు పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో నిపుణుల బృందం రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీకి బుధవారం ఐఎస్‌వో నిపుణుల బృందం రానుంది. రెండు రోజుల పాటు ఈ బృందం యూనివర్సిటీ పాటిస్తున్న బోధన, పరిశోధన, విస్తరణ, వసతి, పాలన, సేవలు వంటి అంశాల్లో ప్రమాణాలను పరిశీలించనుంది. ఐఎస్‌వో సర్టిఫికేషన్ వల్ల యూనివర్సిటీ మరింత గుర్తింపును సంతరించుకుంటుందని వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.త్రిపురసుందరి తెలిపారు.

పారదర్శక ఓటరు జాబితా తయారీకి చర్యలు

డీఆర్వో మోహన్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశపు మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా 6,665 ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. ఇందులో 642 మంది మృతులు, 5,588 మంది వలసలు వెళ్లగా.. మిగిలిన 435 మంది ఓటర్లు పునరావృతం అయినట్లు తెలిపారు. పారదర్శక ఓటరు జాబితా తయారీకి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను సైతం పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. మరణించినవారి ఓటును వారి కుటుంబీకులకు నోటీసు ఇచ్చి, ధ్రువీకరణ పొందాకనే తొలగిస్తున్నట్లు చెప్పారు. ఒక ఓటరు రెండు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తిస్తే బీఎల్వోల ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సురేంద్ర కుమార్(టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు(బీజేపీ), పరదేశి(కాంగ్రెస్), ఉదయ్‌కుమార్(వైసీపీ), గంగరాజు(సీపీఎం), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్, అధికారులు పాల్గొన్నారు.

ఫోరా.. సిక్సా..!

- జోరుగా ఐపీఎల్ బెట్టింగ్
- అడ్డాగా హోటళ్లు, అద్దె ఇళ్లు, శివారు ప్రాంతాలు
- ఈజీ మనీ కోసం భవితను పాడు చేసుకుంటున్న యువత



● ఈ బాల్ ఫోర్ పోతుందా? సిక్సర్ కొడతాడా.. అంటూ బంతి బంతికీ బెట్టింగ్.

● సెంచరీ కొట్టే బ్యాట్స్‌మన్ ఎవరు? ఎక్కువ వికెట్లు తీసే బౌలరు.. గెలిచే జట్టు ఏదీ.. అంటూ మ్యాచ్‌పైనా బెట్టింగు.

● ఇలా శివారు ప్రాంతాలు, హోటళ్లు, అద్దె ఇళ్లు కేంద్రంగా జిల్లాలోని పలుచోట్ల ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో బెట్టింగ్ జోరుగా సాగుతోంది.

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15 ఆంధ్రజ్యోతి: ఈజీ మనీ కోసం అలవాటు పడిన కొందరు బెట్టింగ్‌వైపు అడుగులేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగ్ కాసి.. ఎందరో దెబ్బతిన్నారు. ఒకప్పట్లో తిరుపతిలాంటి నగరాలకే పరిమితమైన ఈ బెట్టింగ్.. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాతో పల్లెలకూ పాకింది. జిల్లాలో కొందరు స్థానికంగానే బెట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. ఇంకొందరు విజయవాడ, బెంగళూరు, చెన్నై, గుంటూరు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ లాంటి నగరాల్లో ఉన్న వారితో సంబంధాలు ఏర్పాటు చేసుకుని ఏజెంట్లను నియమించుకుని ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు సమాచారం. మండల కేంద్రాలతో పాటు కొన్ని గ్రామాల్లో దూరంగా ఉండే ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీల్లో టీవీతో పాటు మద్యం, ఇతర సదుపాయాలు కల్పించి క్రికెట్ బెట్టింగ్‌లు ఆడిస్తున్నట్లు తెలిసింది. మరికొందరు ల్యాప్ టాప్‌లు, ఫోన్ల ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. తిరుపతి, తిరుచానూరు, సత్యవేడు, తలకోన, ఎర్రావారిపాళెం, ఆరణి, విజయపురం, నాయుడుపేట, గూడూరు లాంటి శివారు ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. గతంలో మ్యాచ్ విజయావకాశాలపై బెట్ వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగు యాప్‌లు రావడంతో బంతి బంతికి.. ప్రతి ఓవర్‌కూ పరుగులు, వికెట్లు, నోబాల్స్, వైడ్ బాల్స్.. ఇలా అన్ని రకాలుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఈ బెట్టింగ్‌లో కొంతడబ్బు పోగొట్టుకోగానే ఎలాగైనా తిరిగి సంపాదించాలన్న భావనతో మరింత పందెం కడుతున్నారు. ఇలా.. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. కాగా ఐపీఎల్ సీజన్ ప్రారంభంలోనే నిఘాతో స్థానిక బెట్టింగ్ జరిగే ప్రాంతాలను చాలావరకు కట్టడి చేసినా.. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ఆపడం అసాధ్యంగా మారుతోందని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి


పోషకాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సదుం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవడంతో సురక్షిత ప్రసవాలు జరుగుతాయని చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ నాగమణి సూచించారు. మంగళవారం సదుం బట్టువారిపల్లెలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు, తృణ ధాన్యాలు ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యవంతంగా ఉండొచ్చన్నారు. దీంతోపాటు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాలు, సూచనల మేరకు బాలింతలు శిశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. పోషకాహార ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, జానకి, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఈ కృష్ణతేజ

సోమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణ కు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కృష్ణతేజ తెలిపారు. మంగళవారం తమ్మినాయనపల్లె, వల్లిగట్ల పంచాయతీల్లోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను, నూతన పైపులైను పనులను పరిశీలించారు. నూతనంగా డ్రిల్లింగ్ చేసిన బోర్లను, చేతిబోర్లలో నీటి మట్టం పరిశీలించారు. అనంతరం సచివాలయాల్లో తాగునీటి సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి పరిష్కారం కోసం సమీక్షించారు. కార్యక్రమంలో జేఈ అనూష, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, తమ్మినాయనపల్లె సర్పంచి సురేంద్రరెడ్డి, వాటర్‌షెడ్ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలరాలిన మామిడి


రొంపిచెర్లలో రాలిన మామిడికాయలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని మామిడి రైతులకు ఏటా నష్టాలు మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొంపిచెర్ల మండలంలో సుమారు 200 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. పూత నిలవడానికి, పిందెలు రాలకుండా, నల్ల మచ్చ, పురుగు శోకకుండా తగిన మందులు పిచికారీ చేశారు. అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామడి నేతలరాలిపోతుండటతో రైతులు నష్టాల పాలవుతున్నారు. సోమవారం గానుగచింత, మోటుమల్లెల పంచాయతీల్లో వీచిన గాలులకు మామిడి కాయలు నేలరాలాయి.

రైతు సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట


రాయితీ పరికరాలు అందజేస్తున్న ఏవో సుధాకర్

సోమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద రైతులకు రాయితీతో మంజూరైన ట్రాక్టర్ మడకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు సేద్యపు పరికరాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, మాజీ సర్పంచులు హరిప్రసాద్, టీడీపీ నాయకులు శివశంకర్, మహేంద్రబాబు, రైతుసేవా కేంద్రం రాధిక, కుమార్, జ్యోతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు వేగవంతం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. మంగళవారం మండలంలోని లింగాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించి జనన ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యంపై ఆరా తీశారు. అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి వంద శాతం పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడానికే ప్రతి మంగళవారం పుంగనూరు పోలీసు స్టేషన్‌లో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కుటుంబ కలహాలు, గ్రామాల్లో జరిగే చిన్న చిన్న ఘర్షణలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రాజకీయ కక్షలు ఉన్నట్లు గుర్తించి తమకు ఫిర్యాదు చేస్తే వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వారంలో రెండు రోజులు ఎస్ఐ, సీఐలు గ్రామాల్లోకి పల్లెనిద్ర చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతారని తెలిపారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనవసరంగా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కంతేపల్లె, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలపై చర్చించారు. భూసమస్యలుంటే గొడవలు పడకుండా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. లేకుంటే కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు నగలు వేసుకుని రాత్రుల్లో ఆరుబయట నిద్రించే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే రాత్రి వేళ గ్రామాన్ని సందర్శించి చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐ లోకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవాలు


అలంకరణలో ఉత్సవమూర్తులు

సోమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవాలతో కార్యక్రమాలను ముగించారు. పెద్ద ఉప్పరపల్లె, సోమల, ఆవులపల్లె, కందూరు రామాలయాల్లో స్వామివార్లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే పత్రపల్లెలో సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు. బుధవారం ఉట్లోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నడివీధి గంగమ్మ జాతర ప్రారంభం


ఊరేగింపులో నడివీధి గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలో మంగళవారం నడివీధి గంగమ్మ జాతర వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాల నడుమ కుమ్మరి వీధి నుంచి ఇటీవల నిర్మించిన కల్యాణ గంగమ్మ ఆలయం వద్దకు అమ్మవారిని తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. బెస్త కులస్తులచే గట్టం కుండలు సమర్పించి భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. గోసలకురప్పల్లెలోనూ వైభవంగా నడివీధి గంగమ్మ గంగ జాతర ప్రారంభమైంది.

ఆస్తి కోసం తండ్రీకొడుకుల ఘర్షణ

- కుమారుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంగా జరిగిన గొడవలో కుమారుడిపై తండ్రి కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలం కుమ్మరనత్తం పంచాయతీ పిచ్చిగుంట్లపల్లెకు చెందిన మోదీన్‌ఖాన్ (65)కు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఖాదర్‌ఖాన్(44) పుంగనూరులో నివసిస్తుండగా ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లతో కలిసి మోదీన్‌ఖాన్, అతని భార్య దిల్షాద్ ఉంటున్నారు. వీరికి పిత్రార్జితంగా 3 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. మోదీన్‌ఖాన్ కుమారుడికి, కుమార్తెలకు ఆస్తి సమానంగా ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. దీంతో మంగళవారం కుమారుడు ఖాదర్‌ఖాన్ పిచ్చిగుంట్లపల్లెకు వెళ్లి తనకు పొలం కావాలని నిలదీయడంతో ముగ్గురికి సమానంగా ఇస్తానని, తనను కుమార్తెలే పోషిస్తున్నారని చెప్పడంతో తండ్రీ కుమారుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తండ్రి మోదీన్‌ఖాన్ కుమారుడు ఖాదర్‌ఖాన్‌పై కత్తితో పొడవడంతో గాయపడ్డాడు. అడ్డొచ్చిన కోడలు స్వల్పంగా గాయపడింది. గాయపడిన ఖాదర్‌ఖాన్, అతని భార్యను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ ప్రసాదరావు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీ ల్యాడ్స్‌తో చేపడుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. వీటిల్లో ఉపాధి హామీ పథకం, కాట్పాడి - తిరుపతికి రైల్వే డబుల్ లైన్ తదితరాలు ఉన్నాయి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 21 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు మంగళవారం హాజరు పరిచారు. విచారించిన ఆమె ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున రూ. 2.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ప్రకాష్ పది రోజుల కిందట తన ఇంటి ముందు పల్సర్ వాహనాన్ని పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం చూస్తే ఇంటి ముందు పెట్టిన ద్విచక్రవాహనం కనపడలేదు. దాంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం


కుప్పం: కరపత్రాలు పంచుతున్న అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రవీణ్ కుమార్


పలమనేరు: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


పుంగనూరు: కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

కుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి విజృంభిస్తున్న తరుణంలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కుప్పం అగ్నిమాపకాధికారి డి.ప్రవీణ్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆయన సిబ్బందితో కలిసి కుప్పం పట్టణంలోని బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, బజారు వీధులలో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ గురించి ముద్రించిన ప్రచార కరపత్రాలు పంచిపెట్టారు. వంట గ్యాస్, ఆయిల్స్ వంటివాటితో సంభవించే అగ్నిప్రమాదాలను తెలియజేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది నరేశ్, కృష్ణయ్య, రామమూర్తి, మణి, రఘుపతి, జయకుమార్, విజయ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

- పలమనేరు: వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని .. ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పలమనేరు అగ్నిమాపక కేంద్ర అధికారి మనోగరన్ ప్రజలను కోరారు. మంగళవారం అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా మండలంలోని టి.ఒడ్డూరు గ్రామంలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, టి.ఒడ్డూరు గ్రామస్తులు పాల్గొన్నారు.
- పుంగనూరు: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పుంగనూరుఅగ్నిమాపక అధికారి సుబ్బరాజు సూచించారు. అగ్నిమాపక వారోత్సావాల్లో భాగంగా మంగళవారం పుంగనూరులో దుకాణదారులు, ప్రయాణికులు, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్టు


సారా విక్రేతల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పత్రపల్లె పెద్ద తాండాలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించారు. శంకర్‌నాయక్ భార్య పద్మ వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆమెకు బెల్లం సరఫరా చేసే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పత్రపల్లెతాండాకు చెందిన రామనాయక్ కుమారుడు రమణనాయక్, లక్ష్మనాయక్ కుమారుడు తిప్పానాయక్‌లు సారా విక్రయిస్తూ పట్టు బడటంతో వారి నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. వారికి బెల్లం సరఫరా చేస్తున్న వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జవహర్‌బాబు, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


నాగిరెడ్డిపల్లెలో సోమేశ్వరస్వామి ఊరేగింపు


అగ్నిగుండంలో ప్రవేశించడానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు మునివీరయ్య స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళతాళాల మధ్య వృషభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో శివనామస్మరణల మధ్య శివదీక్షలో ఉన్న భక్తులు ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం


సభ్యత్వ కార్డుల పంపిణీలో ఆంజనేయరెడ్డి తదితరులు

రామకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ పార్టీలో లేని విధంగా టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రామకుప్పం మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధి మిట్టపల్లెలో పార్టీ కార్యకర్తలు, నేతలకు ఆయన పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశంలో యువనేత నారా లోకేశ్ పార్టీలో కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, కేశవరెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య, బ్రహ్మానందం, సుకుమార్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి శయనోత్సవం


ప్రాకారోత్సవంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరుడు

రామకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శయనోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు రాజుపేట సోమప్ప, నాగరాజుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు


వడాయత్తు ఉత్సవం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండరామాలయంలో 12 రోజులుగా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉదయం చక్రస్నానం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వడాయత్తు ఉత్సవాన్ని చిత్తూరు మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాస్, ఎ.రూపల ఉభయంతో నిర్వహించారు. భక్తులకు వడ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలో శ్రీనివాస ట్రస్టు నిర్వాహకుడు మునివేల్, ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్, పర్యవేక్షకుడు చెంగల్‌రాయలు, అర్చక, వేద పండితుల సూపర్‌వైజర్ రవి, అకౌంటెంట్ రెడ్డెప్ప, శ్రీను పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో
అధిక దిగుబడులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని ఏవో సుధారాణి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందితో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 440 మంది రైతుల పొలాల మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 25వ తేదీలోపు పరీక్షలు చేయాలని చెప్పారు.

సోమల హైస్కూల్‌కు బీరువాల వితరణ

సోమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్ పూర్వపు విద్యార్థులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.30 వేలు విలువ చేసే బీరువాలు అందజేసినట్లు హెచ్ఎం హరినాథ్ తెలిపారు. సదుం ఏఎస్ఐ చిన్నిన్నిగారి సత్యనారాయణ, విశాంత్ర హెచ్ఎం. దాసరి వెంకటరమణ సోమల హైస్కూల్‌లో పూర్వపు విద్యార్థులు ఇరువురూ బీరువాలను అందజేశారు. అలాగే పాఠశాల హెచ్ఎంలుగా పనిచేసిన పూర్వపు విద్యార్థులు వై. విద్యావతి, రాశెట్టి హరినాథ్ దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.2 లక్షలు వ్యయం చేసి హైస్కూల్‌కు స్వాగత ఆర్చి, ఇనుప గేటు నిర్మాణం చేపట్టారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు రామకుప్పంలో పుష్పపల్లకి సేవ

రామకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం సప్త పుష్పపల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 10 గంటలకు సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకుడు, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతాలక్ష్మణ, హనుమాన్ సమేత కోదండరామస్వామి, గంగమ్మ, పోతుల రాజు, సల్లాపురెమ్మ ఉత్సవర్లను ఊరేగిస్తారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

భార్యపై అనుమానంతో దాడి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గత ఐదు నెలలుగా భార్యపై అనుమానంతో భర్త రోజూ వేధించడంతో పాటు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు కోనేటిపాళ్యంకు చెందిన కిషోర్, మాధురి 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంత కాలంగా భార్యపై అనుమానంతో రోజూ మద్యం తాగి వేధించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం భార్యను కొట్టి గాయపరచడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు మాధురి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించండి

సోమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పండించిన దిగుబడుల అమ్మకాలను ఆయన పరిశీలించారు. సేంద్రియ సాగు రైతులను ప్రోత్సహించాలన్నారు. దేశీయ వరి వంగడాలు, ఆకుకూరల విత్తనాలతో ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.

26న 'ఒక్కటే జీవితం' పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బహుభాషా అనువాద రచయిత రఘుపతి రామస్వామి రచించిన అనువాద రచన 'ఒక్కటే జీవితం' పుస్తకావిష్కరణను ఈనెల 26వ తేదీన విజయం విద్యాసంస్థల్లో నిర్వహించనున్నారు. ప్రముఖ ఆంగ్ల రచయిత్రి డాక్టరు టి.అనురాధ, జిల్లా రచయితల సంఘ సభ్యులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డాక్టరు కె.రామలక్ష్మి, గిరిధరన్ పాల్గొంటారని రామస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుండె పోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్సర్ బాషా (58) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతిచెందారు. కలికిరి మండలం గుట్టపాళ్యం గ్రామానికి చెందిన అన్సర్ బాషా కొన్నేళ్లుగా ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఇంటి వద్ద ఉండగా ఛాతీలో నొప్పి రావడంతో కింద పడిపోయాడు. వెంటనే అక్కడ నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలి: సీపీఐ



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ నేత కోదండయ్య

నగరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణచట్టం రద్దు చేయాలంటూ సీపీఐ డిమాండ్ చేసింది. నగరిలోని షాదీమహల్‌లో అఖిలపక్ష నేతలతో రౌండ్ టేబుల్ మంగళవారం నిర్వహించింది. వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఎజెండాను అమలుచేయడం దారుణమన్నారు. నాయకులు కోదండయ్య, రఫి, రహమత్ అలీ, వేలన్, బాషా, శేఖర్, రవి, స్టార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'వన్ఎం వన్‌బీ'ని విజయవంతం చేద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న వేణుగోపాల్

నగరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (వన్ ఎం వన్‌బీ) కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కళాశాలలో మంగళవారం ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఈ పథకం తీర్చిదిద్దారని చెప్పారు. ప్రాజెక్టు డైరెక్టర్ శృతి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు కల స్వర్ణభవిష్యత్తు నెరవేరడానికి అనువుగా ఈ పథకాన్ని తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు వితరణ



విజయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్, నెహ్రూ యువజన సేవా సంఘం చొరవతో పన్నూరు సబ్‌స్టేషన్‌లోని పీవీ గర్ల్‌హోమ్‌కు ఆర్వోప్లాంటు మంగళవారం వితరణ చేసింది. ఎస్బీఐ రీజనల్ మేనేజరు వెంకటేశ్వర్లు, నెహ్రూ యువజన సేవా సంఘం డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌లాక్‌తో చోరీలకు చెక్: డీఎస్పీ



స్మార్ట్‌లాక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ అజీజ్

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌లాక్‌ల వినియోగంతో చోరీలను అరికట్టవచ్చని నగరి డీఎస్పీ అజీజ్ తెలిపారు. మంగళవారం వెదురుకుప్పంలో స్మార్ట్‌లాక్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 21 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. రెండ్రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది మద్యం తాగి వాహనాలను నడిపినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు మంగళవారం హాజరు పరిచారు. విచారించిన ఆమె ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున రూ. 2.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన ప్రకాష్ పది రోజుల కిందట తన ఇంటి ముందు పల్సర్ వాహనాన్ని పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం చూస్తే ఇంటి ముందు పెట్టిన ద్విచక్రవాహనం కనపడలేదు. దాంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుండె పోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్సర్ బాషా (58) గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతిచెందారు. కలికిరి మండలం గుట్టపాళ్యం గ్రామానికి చెందిన అన్సర్ బాషా కొన్నేళ్లుగా ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఇంటి వద్ద ఉండగా ఛాతీలో నొప్పి రావడంతో కింద పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ ప్రసాదరావు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీ ల్యాడ్స్‌తో చేపడుతున్న అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. వీటిల్లో ఉపాధి హామీ పథకం, కాట్పాడి - తిరుపతికి రైల్వే డబుల్ లైన్ తదితరాలు ఉన్నాయి.

అజాగ్రత్త వల్లే అగ్నిప్రమాదాలు



చిత్తూరు గాంధీ సర్కిల్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్త వల్లే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గాంధీ సర్కిల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ స్టౌనుంచి మంటలు చెలరేగితే ఏం చేయాలన్న దానిపై ప్రజలకు తెలియజేశారు. ఏడీఎఫ్‌వో కరుణాకర్, ఎల్ఎఫ్‌లు సురేష్, ఏసుపాదం, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నగరి: బస్టాండు ఆవరణలో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, ఫైర్‌స్టేషన్ ఎస్ఐ సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

26న 'ఒక్కటే జీవితం' పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బహుభాషా అనువాద రచయిత రఘుపతి రామస్వామి రచించిన అనువాద రచన 'ఒక్కటే జీవితం' పుస్తకావిష్కరణను ఈనెల 26వ తేదీన విజయం విద్యాసంస్థల్లో నిర్వహించనున్నారు. ప్రముఖ ఆంగ్ల రచయిత్రి డాక్టరు టి.అనురాధ, జిల్లా రచయితల సంఘ సభ్యులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డాక్టరు కె.రామలక్ష్మి, గిరిధరన్ పాల్గొంటారని రామస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పగలే వెన్నెల..!



ఐరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వీఎస్ అగ్రహారంలోని న్యూకాలనీకి వెళ్లే దారిలో రెండు విద్యుత్ వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు పరిశీలించి, ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కోసలనగరంలో తాగునీటి సమస్య

విజయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోసలనగరంలో వారం రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు వీధుల్లో తాగునీరు అందడం లేదని, దీంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి, సర్పంచి పట్టించుకోవడం లేదని, ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెన్నుగాని హరిజనవాడలో సమస్యల తిష్ఠ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లె పంచాయతీ చెన్నుగాని హరిజనవాడలో సమస్యలు తిష్ఠ వేశాయి. గ్రామానికి తాగునీరు అందించే పైపులైను పగిలి నెలలు గడుస్తున్నా అధికారులు, సర్పంచ్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగిలిన పైపుచుట్టూ మురుగుచేరి తాగునీటిలో కలుస్తోందని వాపోతున్నారు. కాలువలు శుభ్రం చేయడంలేని, చెత్త పేరుకుపోయి మురుగు పారక దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. ఇకనైనా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తాగునీటి పైపు పగిలి కలుషితమవుతున్న నీరు

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు



ధ్వజావరోణం చేస్తున్న అర్చకులు - వడాయత్తు ఉత్సవం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండరామాలయంలో 12 రోజులుగా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉదయం చక్రస్నానం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం వడాయత్తు ఉత్సవాన్ని చిత్తూరు మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు కుమారుడు డీఏ శ్రీనివాస్, ఎ.రూపల ఉభయంతో నిర్వహించారు. భక్తులకు వడ, పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస ట్రస్టు నిర్వాహకుడు మునివేల్, ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్, కార్యక్రమాల పర్యవేక్షకుడు చెంగల్‌రాయలు, అర్చక, వేద పండితుల సూపర్‌వైజర్ రవి, అకౌంటెంట్ రెడ్డెప్ప, కల్చరల్ వింగ్ పర్యవేక్షకుడు శాక్సో శ్రీను పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న యాదమరి బాలికలు

యాదమరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ హైస్కూలు బాలికలు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటుకుంటున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నివాసంతోపాటు పేదరికం, వనరులు అంతంతమాత్రమే. ఇవేవీ వారి ప్రతిభకు అడ్డుకాలేదు. నిరంతర సాధన, మొక్కవోని దీక్షతో, పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, వ్యాయాయ ఉపాధ్యాయులు రవి, హరికృష్ణ, షఫీ, దాము ప్రోత్సాహంతో బరిలో దిగితే పతకమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో దూసుకెళుతున్నారు. ఇప్పటికే ఈ బడిలోని క్రీడాకారులు పలు పతకాలు సాధించి, స్థానికుల ప్రశంసలు అందుకున్నారు.

కుస్తీ పోటీల్లో..



జీవనగీత

జీవన గీతకు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. చదువులోనూ మేటి. కుస్తీ పోటీల్లో ప్రతిభ చూపడంతో వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. రాష్ట్రం తరఫున జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఢిల్లీ నోయిడాలో జాతీయ స్థాయి కుస్తీపోటీల్లో పాల్గొని నాల్గవ స్థానంలో నిలిచింది.



జిషిత‌శ్రీ

జిషితశ్రీ చదువులో రాణిస్తూ క్రీడలపైనా చూపడం గమనించిన వ్యాయామ పీడీలు రవి, హరికృష్ణ, షఫీలు కుస్తీ పోటీల్లో తర్ఫీదు ఇచ్చారు. 2024లో యాదమరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో గెలుపొందింది. మధ్యప్రదేశ్, న్యూఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మూడు, నాల్గవ స్థానాల్లో నిలిచింది.

ఫెన్సింగ్ పోటీల్లో..



ఫాతిమా

ఫాతిమా ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపడంతో వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. జమ్ము కశ్మీర్‌లో జరిగిన పోటీలో పాల్గొని ప్రశంసాపత్రాలు సాధించింది. అలాగే యుగభారతి, కల్పన, ధరణి, జీవిత, మోనిషా, మానస తదితరులు రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది.. జాతీయస్థాయికి ఎంపికయ్యారు.

పాలసముద్రంలో నేడు పీజీఆర్ఎస్

● హాజరుకానున్న ప్రభుత్వ విప్ థామస్

పాలసముద్రం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం వెలుగు కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ థామస్ హాజరవుతారన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఈ అంశంపై విద్యావతి సమావేశం నిర్వహించి, పలు సూచనలిచ్చారు. అలాగే మధ్యాహ్నం రెండు గంటలకు కార్యకర్తే అధినేత అనే కార్యక్రమం కూడా ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో జరగనుందన్నారు. దీనిపై టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, తాళ్లూరు శివానాయుడు, బాలాజీ, శ్రీనునాయుడు, అరుణ్ నాథన్, తంగరాజ్, సాంబశివన్ తదితరులతో ఆమె చర్చించారు.

సీహెచ్‌వోకు సన్మానం



పూతలపట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తిని హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాయలసీమ జోన్ ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై మంగళవారం ఆయన్ను పలువురు సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సెక్రటరీ బోగి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్ఞానశేఖర్, స్థానిక వైద్యాధికారి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రీకొడుకుల ఘర్షణ

కుమారుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి విషయంగా జరిగిన గొడవలో కుమారుడిపై తండ్రి కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలం కుమ్మరనత్తం పంచాయతీ పిచ్చిగుంట్లపల్లెకు చెందిన మోదీన్‌ఖాన్ (65)కు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఖాదర్‌ఖాన్(44) పుంగనూరులో నివసిస్తుండగా ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లతో కలిసి మోదీన్‌ఖాన్, అతని భార్య దిల్షాద్ ఉంటున్నారు. వీరికి పిత్రార్జితంగా 3 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. మోదీన్‌ఖాన్ కుమారుడికి, కుమార్తెలకు ఆస్తి సమానంగా ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. దీంతో మంగళవారం కుమారుడు ఖాదర్‌ఖాన్ పిచ్చిగుంట్లపల్లెకు వెళ్లి తనకు పొలం కావాలని నిలదీయడంతో ముగ్గురికి సమానంగా ఇస్తానని, తనను కుమార్తెలే పోషిస్తున్నారని చెప్పడంతో తండ్రీ కుమారుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తండ్రి మోదీన్‌ఖాన్ కుమారుడు ఖాదర్‌ఖాన్‌పై కత్తితో పొడవడంతో గాయపడ్డాడు. అడ్డొచ్చిన కోడలు స్వల్పంగా గాయపడింది. గాయపడిన ఖాదర్‌ఖాన్, అతని భార్యను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకెళ్లి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దు

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి కారణంగా లోతైన చెరువులు, గుంటలు, బావుల్లో సరదాగా ఈతకెళ్లి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని కార్వేటినగరం ఎస్ఐ పి.రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హెచ్చరికలను ఖాతరు చేయకుండా ఆయా ప్రాంతాల్లో ఈతకెళితే చర్యలు తప్పవని మంగళవారం హెచ్చరించారు.

జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. మంగళవారం వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జల్లికట్టు నిర్వహించడానికి ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చారన్నారు. వెదురుకుప్పం మండలంలో సంక్రాంతి పండుగ రోజునే కాకుండా ఎప్పుడుపడితే అప్పుడు జల్లికట్టు నిర్వహిస్తున్నారన్నారు. ఇది చట్ట విరుద్ధమన్నారు.

మహాభారతం నిర్వహణకు అనుమతి తప్పనిసరి

మహాభారతం నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని డీఎస్పీ తెలిపారు. మైక్, ఇతరత్రా అనుమతులను సీఐ, డీఎస్పీ వద్ద ఆన్‌లైన్‌లో తీసుకోవాలన్నారు. అలాగే ఉత్సవాలు జరిగే ప్రాంతమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. డీఎస్పీవెంట వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

చెట్లు నరికేయడం తగదు

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూములపరంగా తగాదాలు ఉంటే పరిష్కరించుకోవాలనే కానీ చెట్లను నరికేయడం తగదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బాలగంగనపల్లె పంచాయతీ కుప్పనపల్లెలో వైసీపీకి చెందిన శంకర్‌రెడ్డికి సంబంధించిన భూమిలో మూడేళ్ల వయసు కలిగిన టేకు, మామిడి చెట్లను అదేగ్రామంలోని టీడీపీకి చెందిన వ్యక్తి రెండ్రోజుల కిందట నరికేశారని ఆరోపిస్తూ మాజీ డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మంగళవారం కుప్పనపల్లెకు వచ్చి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ వ్యక్తికే పక్కాగా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అధికారులు ఆ భూమి అతనిదేనని తేల్చితే వైసీపీ నేత నుంచి టీడీపీవారికి స్వాధీనం చేసేద్దామని చెప్పారు. అంతేకానీ శంకర్‌రెడ్డి ఆర్థిక మూలాలపై దెబ్బతీస్తే, టీడీపీలోకి చేరతారన్న ఆలోచన చేయడం సరికాదన్నారు. నేతలు చిన్నమరెడ్డి, వెంకటరెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఏకాంబరం, అలీషేర్, వెంకటేశులురెడ్డి, గోవిందయ్య పాల్గొన్నారు.

'జిల్లాలో కళాకారులే లేరా?'

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన 'కందుకూరి వీరేశలింగం' అవార్డులకు జిల్లా నుంచి కళాకారులను ఎంపిక చేయక పోవడం శోచనీయం అని కళాకారుల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్ళై, ప్రియా సిస్టర్స్, వేదవతి ప్రభాకర్, ఎం.ఆర్.చంద్ర, జయరాం, శోభరాజు, కుప్పం కంగుంది కళాకారులు, చిత్తూరు ఆర్ట్ లవర్స్ యూనియన్, చిత్తూరు రామవిలాస సభ, రాష్ట్ర, జాతీయ స్థాయి కళాకారులున్నా.. జిల్లాలో కళాకారులే లేరన్నట్లుగా జిల్లా సమాచార శాఖ వ్యవహరించడం బాధగా ఉందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భార్యపై అనుమానంతో దాడి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గత ఐదు నెలలుగా భార్యపై అనుమానంతో భర్త రోజూ వేధించడంతో పాటు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు కోనేటిపాళ్యంకు చెందిన కిషోర్, మాధురి 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంత కాలంగా భార్యపై అనుమానంతో రోజూ మద్యం తాగి వేధించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం భార్యను కొట్టి గాయపరచడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు మాధురి తెలిపారు.

వైభవంగా సీతారాముల వసంతోత్సవం

విజయపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో మంగళవారం సీతారాముల వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారాముల చిత్రపటాన్ని పూలతో అలంకరించి గ్రామంలో ఊరేగిస్తూ.. భక్తులు రంగునీళ్లు చల్లుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని కోలావూరులో మంగళవారం శ్రీరాముడి పట్టాభిషేక పుష్పపల్లకి ఊరేగింపు వసంతోత్సవాలతో ముగిసింది. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, గురజాల జీవన్, మాజీ సర్పంచ్ ఉదయ మధుసూదన్ నాయుడు, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, దాతలు గుణభూషణ్ నాయుడు, కేవీఆర్ బిల్డర్స్ కుటుంబీకులు పాల్గొన్నారు.



శ్రీహరిపురం, కోలావూరులో జరిగిన వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్తంగా..

పాఠశాల వార్షికోత్సవం

పాలసముద్రం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ఆర్‌పురం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్‌నాయుడు, సర్పంచ్ అమరావతి, టీచర్లు పావని, మహాలక్ష్మి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గణపతిరాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల వితరణ



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు బాలికల హాస్టల్లోని విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పెన్నులను మహిళా, శిశు సంక్షేమశాఖ లీగల్ అడ్వైజర్ వెంకటేష్, ఎంప్లాయీస్ జేఏసీ సభ్యుడు లోకనాథం, పీలేరు హాస్టల్ వార్డెన్ అరుల్ దాస్ మంగళవారం వితరణ చేశారు. విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ ఆనందయ్య, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నోటి ఆరోగ్య దినోత్సవం

పూతలపట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పేటమిట్ట గ్రామంలోని రాజన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులు నోటి ఆరోగ్య దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు జైజశ్వంత్, డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ సి.సంధ్య, ఆరోగ్య కేంద్రం అడ్మిన్ ఆఫీసర్ పద్మనాభ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌పై మంగళవారం సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా డీఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తియాప్ ఆపద సమయాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళా ఎస్ఐ నాగ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

'స్వామి'ని కలిసిన వైసీపీ నేతలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వైసీపీ పార్టీ కేంద్ర కమిటీలో చోటు లభించడంతో మంగళవారం వెదురుకుప్పం వైసీపీ నాయకులు పుత్తూరులో కలిశారు. వీరిలో.. జీడీనెల్లూరు నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎన్.రాధిక, ఎంపీటీసీ సభ్యుడు తోకల మురళీరెడ్డి, నాయకులు పుత్తూరు పురంధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గఫూర్ ఉన్నారు.

ముగిసిన సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నాగిరెడ్డిపల్లెలో సోమేశ్వరస్వామి ఊరేగింపు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు మునివీరయ్య స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మేళతాళాల మధ్య వృషభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో శివనామస్మరణల మధ్య శివదీక్షలో ఉన్న భక్తులు ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.